ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 24 జనవరి 2024

27న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

బెంగళూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈనెల 27న బెంగళూరు ప్యాలెస్ మైదానంలో జరగనుంది. ఈ విషయాన్ని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రాజీవ్ నగరంలో మంగళవారం మీడియాకు తెలిపారు. సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర అధ్యక్షత వహిస్తారని కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్ ప్రత్యేక అతిథిగా పాల్గొంటారన్నారు. కాగా కలబురగి జిల్లాలోని ఓ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులదండ వేసి అవమానించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతల పరిస్థితి క్షీణిస్తోందని విరుచుకుపడ్డారు.



బడ్జెట్‌పై సీఎం కసరత్తు

- ఒకేరోజు 20 శాఖల ప్రగతిపై సమీక్ష
- పన్నుపోటు లేకుండా జాగ్రత్తలు
- సవాలుగా మారిన వనరుల సమీకరణ

బెంగళూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 2024-25 వార్షిక బడ్జెట్‌పై కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా తన అధికార నివాసం కృష్ణలో మంగళవారం ఒకటి రెండు అధికారిక కార్యక్రమాలు మినహా మిగతా సమయాన్నంతా వివిధ శాఖల ప్రగతిపైనే సమీక్ష జరిపారు. ఒకేరోజు ఆయన 20 శాఖలకు సంబంధించి గత బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు, జరిగిన ఖర్చును పరిశీలించారు. వీటిలో వసతి, మైనారిటీ సంక్షేమం, పరిపాలనా, రెవెన్యూ, కార్మిక, భారీ పరిశ్రమలు, ప్రజాపనులు, చిన్నతరహా పరిశ్రమలు, ఇంధన, పర్యాటక, న్యాయ, రవాణా, దేవదాయ, చక్కెర, జౌళి, నగరాభివృద్ధి, ఓడరేవులు తదితరశాఖలు ఉన్నాయి. బడ్జెట్ కేటాయింపులను ఖర్చు చేయని శాఖల అధికారుల తీరుపై ఆయన ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్థిక శాఖను స్వయంగా తానే నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన 15వ బడ్జెట్‌ను ఫిబ్రవరి 16న శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి బడ్జెట్‌గాత్రం అధికంగా ఉంటుందని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలకు రూ.59వేల కోట్లను రిజర్వు చేయనున్నారు. ఈ పథకాల ద్వారా 4 కోట్ల మంది ప్రత్యక్షంగా లబ్ధి పొందుతున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇంతవరకు ప్రవేశపెట్టిన 14 బడ్జెట్‌లలో కేవలం ఒక బడ్జెట్ మాత్రమే కొరతతో కూడినది కావడం గమనార్హం. మిగిలినవన్నీ మిగులు బడ్జెట్‌లే.

పన్నుపోటు లేని బడ్జెట్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సామాన్యులపై పన్నుపోటు ఉండకపోవచ్చునని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. అయితే ధనికులపై, మందుబాబులపై పన్నుపోటు తప్పకపోవచ్చునని అంచనా వేస్తున్నారు. ప్రత్యేకించి ఆదాయ వనరులను గణనీయంగా పెంచుకోవాల్సిన అవసరం ఉండడంతో ప్రభుత్వం అబ్కారీశాఖ ద్వారా దీన్ని సమకూర్చే అవకాశం ఉందని సమాచారం. బడ్జెట్‌లో ఈసారి బీర్ ధర కొంత మేరకు పెరిగే అవకాశం ఉందని అబ్కారీ వర్గాలు సూచనప్రాయంగా తెలిపాయి.

ఆర్థిక వనరుల సమీకరణే ఓ సవాల్

గ్యారెంటీ పథకాలైన గృహలక్ష్మి, గృహజ్యోతి, శక్తి, యువనిధి, అన్నభాగ్యకు ఏటా రూ.56వేల కోట్లకుపైగా ఖర్చు చేయాల్సి రావడంతో అభివృద్ధి కార్యక్రమాలపై దీని ప్రభావం తీవ్రంగానే పడుతోంది. తొలి బడ్జెట్‌లో అభివృద్ధి పనులకు పెద్దగా కేటాయింపులు చేయలేకపోయిన సిద్ధరామయ్య తన మలి బడ్జెట్‌లో భారీగానే కేటాయింపులు చేసి ప్రతిపక్షాల విమర్శలకు దీటైన సమాధానం ఇచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎమ్మెల్యేల నియోజకవర్గాల అభివృద్ధికి కూడా బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత లభిస్తుందని అంటున్నారు. ప్రస్తుత ఏడాది బోర్డులు, కార్పొరేషన్ అధ్యక్ష పదవుల పందేరం జరగనుండడంతో ప్రభుత్వ ఖజానాపై కొంతమేరకు భారం పడనుంది. ఆర్థిక వనరుల సమీకరణే ముఖ్యమంత్రికి పెను సవాల్‌గా ఉంది. ప్రత్యేకించి రెవెన్యూ, అబ్కారీ, రవాణశాఖల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని భావించినా శక్తి గ్యారెంటీ పథకం కారణంగా రవాణా శాఖ ఆదాయంలో కొంతమేరకు కోత పడుతోంది. దీంతో ప్రత్యామ్నాయ ఆర్థిక వనరుల సేకరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆశించిన మేరకు గ్రాంట్లు విడుదల కావడం లేదని, రాష్ట్ర పన్నుల వాటా విడుదల విషయంలోనూ అన్యాయం జరుగుతోందని ముఖ్యమంత్రి ఆర్థికశాఖ సలహాదారుడు, ఎమ్మెల్యే బసవరాజరాయరెడ్డి పేర్కొన్నారు. సామాన్య ప్రజలపై పన్నుపోటు లేకుండా బడ్జెట్ కసరత్తు చేస్తున్నామని, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకునే అంశంపై కూడా దృష్టి సారించామన్నారు.

లోకాయుక్తకు పట్టుబడిన

జెస్కాం ఏఈఈ



కెంచప్ప(ఫైల్)

రాయచూరు జనవరి 23: విద్యుత్ కనెక్షన్ కోసం వినియోగదారుడి నుంచి లంచం డిమాండ్ చేసిన జెస్కాం ఏఈఈ లోకాయుక్త అధికారులకు పట్టుబడ్డాడు. రాయచూరు జిల్లా లింగసుగూరు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జెస్కాం ఏఈఈ కెంచప్ప, ఆశిహాళ్ తండాకు చెందిన ప్రేమ్‌కుమార్ ఇంటి కనెక్షన్ కోసం దరఖాస్తు చేయగా రూ.10వేలు లంచం డిమాండ్ చేశాడు. అధికారి ప్రవర్తనతో విసుగు చెందిన ప్రేమ్‌కుమార్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. దీంతో లోకాయుక్త జిల్లా ఎస్పీ ఎంఎన్ శశిధర్ నేతృత్వంలో డీఎస్పీ సిద్దేశ్వర్ తన సిబ్బందితో కలిసి మంగళవారం ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో లంచం తీసుకుంటూ ఏఈఈ కెంచప్ప రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. దాడి జరిగిన సమయంలో తాను అనారోగ్యానికి గురైనట్లు కెంచప్ప తెలపడంతో ఆస్పత్రికి తరలించారు.

కట్టుదిట్టంగా ఎస్ఐ పరీక్షలు

బెంగళూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పోస్టుల నియామకాలకు సంబంధించిన పరీక్షలు నగరంలో మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. గతంలో పలు ఆరోపణలు రావడంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. 117 కేంద్రాల్లో పోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు జరిగాయి. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు, మధ్యాహ్నం 1గంట నుంచి 2.30 వరకు నిర్వహించారు. పరీక్షలకు సుమారు 54వేల మంది అభ్యర్థులు హాజరైనట్టు తెలుస్తోంది. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద నలుగురు ఆర్మ్‌డ్ సిబ్బంది, ఇద్దరు మహిళా సిబ్బందిని కేటాయించారు. మొత్తం 40 బెటాలియన్ పోలీసులను భద్రతకు నియమించారు. 545 పోస్టులకు జరిగిన పరీక్షలకు సంబంధించి కేంద్రాల చుట్టు పక్కల దుకాణాలు, జిరాక్స్ సెంటర్ల వద్ద నిషా విధించారు. మెటల్ డిటెక్టర్ ద్వారా పరిశీలించాకనే అభ్యర్థులను అనుమతించారు.

బీజేపీ గూండాలకు భయపడేది లేదు

- ఉద్దేశపూర్వకంగా అస్సాంలో రాహుల్ యాత్రకు ఆటంకాలు
- కాంగ్రెస్ నిరసనలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆగ్రహం



ధర్నాలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి, మంత్రులు

బెంగళూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గూండాలు ఒక చేతిలో అక్షింతలు, మరో చేతిలో లాఠీలతో రోడ్లపైకి దిగారని, వీరి బెదిరింపులకు భయపడబోమని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రారంభించిన న్యాయ్ యాత్రను అస్సాంలో బీజేపీ అడ్డుకుంటున్న తీరుపై కాంగ్రెస్ విరుచుకుపడింది. ఇందుకు నిరసనగా బెంగళూరులోని ఫ్రీడం పార్కులో మంగళవారం ధర్నా నిర్వహించింది. ధర్నాలో పాల్గొన్న కార్యకర్తలను ఉద్దేశించి ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ అస్సాంలో గత రెండు రోజులుగా భారత్ జోడో న్యాయ్ యాత్రపై బీజేపీ కార్యకర్తలు ఉద్దేశ్యపూర్వకంగా దాడులు చేస్తున్నారని ఆరోపించారు. అస్సాంలో జరుగుతున్న పరిణామాలు దేశంలో ప్రజాస్వామ్యం ఉందా అనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయన్నారు. దేశంలో ప్రజల హృదయాలను కలిపేందుకు, ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై గొంతెత్తేందుకు రాహుల్‌గాంధీ ప్రారంభించిన భారత్‌జోడో యాత్రకు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. దీన్ని ఓర్వలేక దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు త్యాగాలు చేశారన్నారు. ఇందిరాగాంధీ, సంజయ్‌గాంధీ, రాజీవ్‌గాంధీల త్యాగాలను స్మరించుకుంటూ రాహుల్‌గాంధీ కూడా దేశ ప్రజల కోసం యాత్ర నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దేశం కోసం త్యాగాలు చేయని సంఘ్ పరివార్‌కు, బీజేపీకి త్యాగాలంటే ఏమిటో ఎలా తెలుస్తాయని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధికోసమే ప్రజాసమస్యలను పక్కదారి పట్టిస్తూ బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని, అయోధ్య రామమందిర ప్రారంభం కూడా ఇందులో భాగమే అన్నారు. గ్యారెంటీ పథకాల ద్వారా రామ రాజ్య కలను తాము సాకారం చేస్తున్నామని తెలిపారు మంత్రులు రామలింగారెడ్డి, కేజే జార్జ్ తదితరులు ప్రసంగించారు. కాగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈనెల 26న గణతంత్ర దినోత్సవ సందర్భంగా కేపీసీసీ కార్యాలయానికి వస్తున్నారన్నారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత లోక్‌సభ అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. పార్టీ సీనియర్ నేతలు బీకే హరిప్రసాద్, హెచ్ఎం రేవణ్ణ, సలీం అహ్మద్, యూబీ వెంకటేశ్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

అసలు సిసలైన దేశభక్తుడు నేతాజీ

- ముఖ్యమంత్రి సిద్దరామయ్య



సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్‌చంద్రబోస్ స్వాతంత్ర్య పోరాటానికే తన జీవితాన్ని అంకితం చేసి అసలు సిసలైన దేశభక్తుడిగా చరిత్రపుటల్లో నిలిచారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య కొనియాడారు. నేతాజీ 127వ జయంతిని పురస్కరించుకుని సచివాలయంలోని ఆయన చిత్రపటానికి మంగళవారం పుష్పాంజలి ఘటించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ కాంగ్రెస్ అధ్యక్షుడిగా స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీతో కలసి నేతాజీ పోషించిన పాత్రను స్మరించుకున్నారు. గాంధీజీ శాంతి, అహింస మంత్రం పఠించగా, చంద్రబోస్ తనదైన విభిన్న సిద్ధాంతాన్ని తెరపైకి తెచ్చారని పేర్కొన్నారు. అయితే ఇద్దరి లక్ష్యం దేశానికి స్వాతంత్ర్యం సాధించడమే అన్నారు. విమాన ప్రమాదానికి గురై వీరమరణం పొందినా నేతాజీ సుభాష్‌చంద్రబోస్ కోట్లాదిమంది యువత హృదయాలలో చిరస్థానం సంపాదించారని అన్నారు. దేశప్రజలకు ఆదర్శప్రాయంగా స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల నేతాజీ చంద్రబోస్ జయంతి ఘనంగా జరిగింది.

ఉత్తమ మహిళా పాడి రైతులకు పురస్కారాలు

బెంగళూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భారతీయ పాడిపరిశ్రమ సమాఖ్య దక్షిణ విభాగం పాడి పరిశ్రమల రంగంలో అసాధారణ ప్రతిభను కనబర్చిన పలువురు అభ్యుదయ మహిళా రైతులను నగరంలో ఘనంగా సన్మానించింది. బెంగళూరులోని కర్ణాటక పశువైద్య మండలి సభాభవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కేసీ వీరణ్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే దిశలో పాడి పరిశ్రమ గణనీయ పాత్రను పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక డెయిరీ ఉత్పత్తుల దిగుబడి ఇటీవలి కాలంలో అధికం కావడం వెనుక మానవ వనరుల సద్వినియోగం, సాంకేతిక వంటివి ఉన్నాయన్నారు. బెంగళూరులోని నేషనల్ డెయిరీ పరిశోధనా సంస్థ మాజీ అధినేత, భారతీయ డెయిరీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ సతీష్ కులకర్ణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ఆర్థిక ప్రగతిలో పాడిపరిశ్రమ ప్రధాన పాత్రను పోషిస్తోందన్నారు. వ్యవసాయం రంగంలో ప్రగతి 1.5 శాతం ఉంటే పాడిపరిశ్రమలో ప్రగతి 4.5 శాతంగా ఉందన్నారు. గుజరాత్ పాల మార్కెట్ల సమాఖ్య మాజీ మేనేజింగ్ డైరెక్టర్, ప్రస్తుతం భారతీయ పాడిపరిశ్రమ సమాఖ్య అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ ఆర్ ఎస్ సోధి మాట్లాడుతూ భారతీయ పాడి పరిశ్రమ సమాఖ్య స్వర్ణోత్సవాలు మార్చి 4 నుంచి 6 వరకు హైదరాబాదులో జరుగుతాయన్నారు. ఇదే వేదికపై ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణకు చెందిన ఐదుగురు అభ్యుదయ మహిళా పాడి రైతులను పురస్కారాలతో సన్మానించారు. పురస్కారం అందుకున్న వారిలో కర్ణాటకకు చెందిన ఏఎన్ రాజేశ్వరి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అళిగేని శ్రీపద్మ, తెలంగాణాకు చెందిన డబ్బు పద్మ, కేరళకు చెందిన లీమా రోస్లిన్, తమిళనాడుకు చెందిన పరిమళా విజయ రమేష్ ఉన్నారు. భారతీయ పాడిపరిశ్రమ సమాఖ్య తెలంగాణ విభాగం అధ్యక్షుడు రాజేశ్వర్‌రావుతో పాటు సమాఖ్య సభ్యుడు ఎస్‌కే భట్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



చెక్కు అందుకుంటున్న మహిళా పాడి రైతు



తణ్ణీర్‌భావి బీచ్

మంగళూరులో బ్లూ ఫ్లాగ్ బీచ్ సిద్ధం

- దేశంలో ఇది పదమూడోది
- త్వరలోనే ప్రారంభం

బెంగళూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అకేషియా చెట్ల నీడన, సముద్రపు చల్లటి గాలులను ఆస్వాదిస్తూ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించాలంటే మంగళూరులోని తణ్ణీర్‌భావి సముద్రతీరంలోని బ్లూ ఫ్లాగ్ బీచ్‌ను సందర్శించాల్సిందే. దేశంలోనే 13వ బ్లూ ఫ్లాగ్ బీచ్ నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. పర్యాటకశాఖ డిప్యూటీ డైరెక్టర్ మాణిక్య ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం మీడియాకు తెలిపారు. స్మార్ట్‌సిటీ స్వాగత ద్వారం, స్టాళ్ల నిర్మాణం నెలాఖరునాటికి పూర్తి కానుందన్నారు. అనంతరం ఎంట్రీ ఫీజును ఖరారు చేస్తామని పేర్కొన్నారు. అధికారికంగా ప్రారంభించిన అనంతరమే పర్యాటకులను ఈ బీచ్‌లోకి అనుమతిస్తామని తెలిపారు. పూణేకు చెందిన బీవీజీ ఇండియా లిమిటెడ్ రూ.7.56 కోట్ల ఖర్చుతో బీచ్ అభివృద్ధి పనులు చేపట్టింది. ఇందులో స్మార్ట్ సిటీ పథకం కింద ప్రత్యేక ఆర్చ్‌ను నిర్మిస్తున్నారు. బ్లూ ఫ్లాగ్ బీచ్ దాదాపు ఒక కిలోమీటరు పరిధి మేరకు ఉంటుంది. బీచ్‌లో మిలామిలా మెరిసే తెల్లటి ఇసుక అదనపు ఆకర్షణ కానుంది. ఇక్కడ చెత్త



సం స్కరణ కోసం ప్రత్యేకంగా గ్రే వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో నీటి ద్వారా నీటిని బీచ్‌లోని చెట్ల కోసం వినియోగిస్తారు. మహిళలు, పురుషులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా శౌచాలయాలు, దుస్తులు మార్చుకునేందుకు గదులు, షవర్ సదుపాయం కల్పిస్తున్నారు. ఈ బీచ్ ద్వారా సముద్రంలోకి 400 మీటర్ల ప్రదేశంలో అత్యంత సురక్షితంగా స్విమ్మింగ్ చేసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. అయినా ముందు జాగ్రత్తగా రెండు వాచ్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. బ్లూ ఫ్లాగ్ బీచ్‌కు సంబంధించిన పనులన్నీ దాదాపు పూర్తయ్యాయని, సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నామని బ్లూ ఫ్లాగ్ కంట్రోలర్ నుంచి సానుకూల సంకేతాలు వచ్చాయని బీచ్ మేనేజర్ సుజిత్‌కుమార్ వెల్లడించా రు. పూర్తిస్థాయిలో స్వచ్ఛతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ బీచ్‌ను సందర్శించినవారికి విదేశాల్లో ఉన్నామా... అనే అనుభూతి కలుగుతుందన్నారు.

ఏపీలో టీడీపీ గెలుపే లక్ష్యం



బెంగళూరు టీడీపీ ఫోరం కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న చిన్నారులు

- బెంగళూరు టీడీపీ ఫోరం ప్రతిన
- ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు


బెంగళూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తామని బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు ప్రతినబూనారు. బెంగళూరు టీడీపీ ఫోరం కార్యాలయంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో బెంగళూరు టీడీపీ ఫోరం నేతలు రావి మోహన్ చౌదరి, సోంపల్లి శ్రీకాంత్, పవన్ మోటుపల్లి, శివ చినుమోలు, కోకా కేశవ్, ప్రసాద్, రవి, సురేశ్, లెనిన్, రాజు, రమేశ్, శివకుమారి, నవీన్‌రెడ్డి, బాలాజి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫోరం నేతలు మాట్లాడుతూ యువగళం పేరిట కుప్పంలో పాదయాత్ర ప్రారంభించి 3,132 కిలోమీటర్ల మేర ప్రయాణించి లక్షలాదిమంది ప్రజలను స్వయంగా కలసి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థకు నారా లోకేశ్ నిజమైన నిర్వచనం ఇచ్చారన్నారు. ఎన్నికల సంఘం ప్రకటించిన తుది ఓటర్ల జాబితాను ఒకసారి పరిశీలించుకోవాలని బెంగళూరులో స్థిరపడిన ప్రవాసాంధ్రులకు సూచించారు. జాబితాలో ఓటు ఉందో లేదో తెలుసుకునేందుకు బెంగళూరు టీడీపీ ఫోరం కార్యాలయంలో ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

యలహంకలో..

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను యలహంకలో మంగళవారం సాయంత్రం అభిమానులు ఉత్సాహంగా జరిపారు. స్థానిక ప్రముఖులు పాపణ్ణ, చెన్నకేశవులు, చిన్నప్ప నేతృత్వం వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. హోటల్ రమణ, ఉత్తన్న, వెంకటరమణారెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, పురుషోత్తం, ఓడీసీ బాబా, బాలాజీ, నాగిరెడ్డి, వేమారెడ్డి, అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాపణ్ణ మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల వారికి తెలుగుదేశంలో సముచితస్థానం లభిస్తుందన్నారు. పార్టీకి బీసీలు వెన్నెముకగా ఉన్నారన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబు నాయుడును మళ్లీ సీఎం చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో స్థానికంగా ఉంటున్న హిందూపురం, పెనుకొండ, రాప్తాడు, ధర్మవరం ప్రాంతాలకు చెందిన టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.



యలహంకలో పాల్గొన్న అభిమానులు, చిన్నారులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.81	1,618.74
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	359	8,738
సామర్థ్యం (టీఎంసీలు)	10.07	57.87

చంద్రబాబుకు అండగా నిలబడదాం

● విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావుకు సిరుగుప్పలో స్వాగతం పలికిన కమ్మసంఘం గౌరవాధ్యక్షుడు కొల్లి శ్రీనివాసరావు


సిరుగుప్ప, జనవరి 23 : అలుపెరుగని మహానాయకుడు చంద్రబాబునాయుడుకు వెన్నుదన్నుగా వుంటామని సిరుగుప్ప కమ్మసంఘం గౌరవాధ్యక్షులు కొల్లి శ్రీనివాసరావు అన్నారు. సిరుగుప్ప పట్టణానికి మంగళవారం ఏపీ విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు రాక సందర్భంగా కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. నారాలోకేష్ జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు మాట్లాడుతూ తాను కర్ణాటకలో కార్వార్‌లో విద్యాభ్యాసం చేసినట్లు తెలిపారు. బళ్లారి ముల్లంగి చౌదరితో అవినాభావ సంబంధాలు వున్నట్లు ఆయన తెలిపారు. జగన్‌ను సీయం పీఠం నుంచి దించే రోజులు దగ్గర పడ్డాయని ఆయన తెలిపారు. సరిహద్దు ప్రాంత ఆంధ్రులు తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని సూచించారు. కృష్ణా జిల్లా చరిత్రను చెరిపేశారని ఆయన విమర్శించారు. మరలా కృష్ణా జిల్లాకు పూర్వ వైభవం తీసుకురావాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని ఆయన తెలిపారు.

అనంతరం గద్దె అనురాధ మాట్లాడుతూ జగన్ తన హయాంలో ప్రజలకు చేసిందేమీలేదని ఆమె ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం గోదావరి, తుంగభద్రకు సంబంధించి రైతులకు సాగునీరు అందేటట్లు చూడటంలేదని విమర్శించారు. తెలుగుదేశం విద్యార్థి సంఘం ప్రతినిధి పోట్లూరి దర్శిత్ మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు లేక ఎందరో ఆత్మహత్యలు చేసుకున్నారని విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యేలలో ఎవరికీ రూ. 500 కోట్లకు పైగా ఆదాయం లేదని అలాంటిది సీయం జగన్‌కు రూ. 510 కోట్ల ఆదాయం వుందని విమర్శించారు. రాజకీయంగా ఎన్టీఆర్ ప్రజలకు మరుపురాని సేవలుచేస్తే వాటన్నింటిని తుంగలో తొక్కేసిన సీయం జగన్ అధికార పీఠం దిగాలంటే ఎన్నికల సంగ్రామానికి ప్రతి ఒక్కరు సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా సిరుగుప్ప కమ్మసంఘం సభ్యులైన కొల్లి అరుణ, కొల్లి సుగుణ, తాలుకా అధ్యక్షులు జాలాది రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు తాతినేని ప్రసాద్, ప్రతాప్ చౌదరి, మాజీ అధ్యక్షులు కోనేరు గోపాలకృష్ణ, రమేష్ బాబు, చౌదరి, పదాధికారులు మురళి, గణేష్‌రావు, ప్రసాద్, రఘుకిరణ్, కమ్మ కార్యవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



లోకేష్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి తినిపిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గృహలక్ష్మి నమోదుకు సర్వర్ కష్టాలు



సర్వర్ పనిచేయడంలేదని నోటీసు బోర్డు

హొసపేట, జనవరి 23: విజయనగరం జిల్లా హొసపేటలోని మహిళా అభివృద్ధి శాఖకు గృహలక్ష్మి పథకం నమోదు కోసం ఎవరైనా వస్తే 'సర్వర్ లేదు రేపు రండి' అని బోర్డు దర్శనమిస్తుంది. ఎన్నిరోజులైనా ఈ పరిస్థితి మారడంలేదు. దీంతో తమ పనులను విడిచి పెట్టి రోజు ఈకార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని సామాన్య ప్రజలు వాపోతున్నారు. తాము పనికి పోకుంటే జీవనం కష్టమవుతుందన్నారు. పనులు వదిలేసి రోజు ఆఫీసుకు రాకపోకలు సాగించాల్సి వచ్చిందని ఆవేదనవ్యక్తం చేశారు. కొట్టిగినాల్ గ్రామం నుంచి రెండు మూడు రోజులుగా వస్తున్నామని, సర్వర్ సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదని వాపోయారు. జీవనోపాధి కోసం పనులు చేసుకుంటున్న తమలాంటి వారి పట్ల అధికారులు సత్వరమే కనికరం చూపించి సర్వర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని గాళెమ్మ అనే మహిళ కోరుతున్నారు.

విమ్స్ మైదానంలో గణతంత్ర వేడుకలు



బళ్లారి సిటీ,జనవరి 23: జిల్లా యంత్రాంగం 75వ గణతంత్ర వేడుకలను జనవరి 26వ తేదీ ఉదయం విమ్స్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లాకలెక్టర్‌ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. బళ్లారి ఇన్‌చార్జిమంత్రి నాగేంద్ర జెండాను ఎగురవేస్తారని, అంతకంటే ముందు విమ్స్ ఆవరణలోని గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తారన్నారు. తదనంతరం గణతంత్ర దినోత్సవ సందేశం ఇస్తారన్నారు. ఈసందర్భంగా ఎంపీ.దేవేంద్రప్ప, కరడి సంగన్న, నాసీర్ హుస్సేన్, ఎమ్మెల్యే సండూరు తుకారం, బిఎం.నాగరాజు, సిటీ ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి, విధానపరిషత్ చంద్రశేఖర్ పాటిల్, వై.ఎం.సతీశ్, మేయర్ శ్వేత, జిల్లాపోలీసు అధికారి రంజిత్‌కుమార్ బండారు, జిల్లాపంచాయతీ అధికారి రాహుల్ శరణప్ప తదితరులు పాల్గొంటారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జడేసాబ్ ఖాద్రీ ఉరుసు



ఉరుసు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, జనవరి 23 : కంప్లి పట్టణం గంగావతి రోడ్డులో వెలసిన 236 హజరత్ సయ్యద్ షాహ ముస్తఫా జడేసాబ్ ఖాద్రీ ఉరుసును భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎమ్మెల్యే ఉరుసు కార్యక్రమంలో పాల్గొని పూజలు చేపట్టారు. పూజల్లో పాల్గొన్న భక్తాదులకు దర్గా కమిటీ అన్న ప్రసాద వితరణ చేశారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పిస్తా

కంప్లి, జనవరి 23: బస్సుసౌకర్యంలేక ఇబ్బంది పడుతున్న కురుగోడు తాలుకా పరిధిలోని పట్టణ విద్యార్థుల సమస్యపై ఎమ్మెల్యే జేఎన్ గణేష్ అధికారులతో మాట్లాడారు. మంగళవారం ఆయన వెళుతున్న మార్గంలో ఎదురువస్తున్న విద్యార్థులను గమనించిన ఆయన ఆ సమయంలో వారికి బస్సు సౌకర్యంలేదని తెలుసుకున్నారు. ఆయనతో 9, 10 విద్యార్థులు మాట్లాడుతూ కేవలం ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సు సౌకర్యం వుందని, మధ్యాహ్న సమయంలో బస్సుసౌకర్యం లేదని తెలిపారు. వెంటనే ఆయన బళ్లారి అధికారులను ఫోన్‌లో సంప్రదించి పట్టణశెరుగు గ్రామానికి ఉదయం, సాయంత్రం మాదిరిగానే మధ్యాహ్నం వేళల్లో కూడా బస్సుసౌకర్యం కల్పించాలని కేఎస్ఆర్టీసీ అధికారులకు సూచించారు. వెంటనే అధికారులు స్పందించి బస్సుసౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

వరి రైతుకు చింత..!



నది ఒడ్డున గ్రామాలలో వరి పైరు

కంప్లి, జనవరి 23 : కంప్లి తుంగభద్ర నది ఒడ్డున్న బెళగోడుహాళ్, సన్నాపురం, ఇటిగి, మన్నూరు, సూగూరు తదితర గ్రామాలలో నదిలోని నీరు ఆధారంగా వరి పంటసాగు చేస్తున్నారు. గత ఏడాది భారీవర్షాల కారణంగా పంట చివరి వరకూ నదిలో నీరు ఉండేది. ప్రస్తుతం ఎండలు ముదిరేకొద్దీ నదిలో నీరు తగ్గుతోంది. నీరు తగ్గితే ఎలాఅని రైతులు భయపడుతున్నారు. కొంతమంది ధైర్యంచేసి ఇప్పటికే పంటలకు మొదటిదఫా రసాయనిక ఎరువులు చల్లారు. కొంతమంది బోర్లున్న రైతులు మాత్రం ధైర్యంగా నాట్లు వేసుకుని వరి సాగుచేస్తుండగా, బోర్లులేని రైతులు.. నదిలో నీటి ప్రవాహం తగ్గుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి

జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, జనవరి 23: మహిళల కోసం పలు ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నారని, వీటిని ఉపయోగించుకుని ముందుకు సాగాలని జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సంకనూర్ కోరారు. ఎస్‌హెచ్‌జీ మహిళలకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఫోర్ వీలర్ డ్రైవింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామపంచాయితీ స్థాయిలో ఘన, ద్రవ వ్యర్థ వాహనాలకు స్వయం సహాయక సంఘాల మహిళలను డ్రైవర్లుగా ఎంపిక చేశామన్నారు. మహిళలు ఆసక్తి చూపి ధైర్యంగా వాహనాలను నడపడం నేర్చుకోవాలన్నారు. మంచి శిక్షణ పొంది స్వావలంబనతో జీవనం సాగించాలన్నారు. జిల్లాపంచాయితీ ప్లానింగ్ డైరెక్టర్ ప్రమోద్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ కార్యక్రమంలో మహిళల పాత్ర ఎంతో ఉందన్నారు. ఈసందర్భంగా కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయ ఏజీఎం. మురళీకృష్ణ, ఖాగ్రా డిప్యూటీ డైరెక్టర్ సాదిక్ ఉల్లా, తాలూపంచాయితీ ఈఓ మాదిగిన బసప్ప, కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయ సీనియర్ మేనేజర్ శరణ్‌బసవరెడ్డి, కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ రాజేసాబ్ ఎరిమణి, జిల్లాప్రోగాం మేనేజర్ రాజేంద్ర, 30మంది శిబిరార్థులు పాల్గొన్నారు.



ఫోర్‌వీలర్ శిక్షణ కార్యక్రమాన్ని పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న అధికారులు

నేతాజీ బాటలో యువత నడవాలి




ఏఐకేకేఎంఎస్ రైతు సంస్థ ఆధ్వర్యంలో నేతాజీకి నివాళులర్పిస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ, జనవరి 23: నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆలోచనలను నేటి యువత అనుసరించాలని ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం ప్రముఖులు ఎస్ఎన్ స్వామి పేర్కొన్నారు. ఏఐకేకేఎంఎస్ రైతుసంస్థ జిల్లా కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ 127వ జయంతి వేడుకలను పురస్కరించుకుని వారి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం భారత స్వాతంత్ర్య సమరంలో నేతాజీ పాత్ర గురించి ప్రసంగించారు. ఆయనవల్లనే బ్రిటీష్ వారు ఈ దేశాన్ని విడిపెట్టి వెళ్లారన్నారు. రాజకీయంగా జరుగుతున్న దోపిడీ నుంచి ఇక్కడి శ్రామిక ప్రజలు విముక్తి చెందాలని ఆయన ఆకాంక్షించారన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, అన్యాయానికి వ్యతిరేకంగా గళం విప్పాలని సుభాష్ కోరుకునేవారన్నారు. ఈసందర్భంగా కార్మిక నాయకులు ఏ.దేవదాస్, ఏఐకేకేఎంఎస్ జిల్లాధ్యక్షుడు గోవింద్, జిల్లా కార్యదర్శి గురల్లి రాజా, బళ్లారి తాలూకా కార్యదర్శి ధనరాజ్, జిల్లాకమిటీ సభ్యులు బసవరాజ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రామాలయాల్లో పూజలు

కంప్లి, జనవరి 23 : అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా సాయంత్రం వేళల్లో కంప్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే వివిధ ధార్మిక కార్యక్రమాలు కూడా చేపట్టారు. కంప్లి, కురుగోడు, కుడితిని, తదితర క్యాంపుల్లోను, అలాగే కంప్లి సమీపంలోని సన్నాపురం రామదేవ క్యాంపులో కోదండరామస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నారాయణ స్వామి క్యాంపులో సాయంత్రంవేళ హనుమత్‌లక్ష్మణ సీతారామచంద్ర మూర్తుల వద్ద జ్యోతులు వెలిగించి పూజలు నిర్వహించారు. సాహితీ పాఠశాలలో సీతారామలక్ష్మణ ఆంజనేయ వేషధారణలో చిన్నారుల వేషభూషణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే సాహితీ పాఠశాల విద్యార్థిని అమూల్య చిత్రీకరించిన అయోధ్య రామాలయ చిత్రం పూర్తిగా ఆకట్టుకుంది. మొత్తానికి అయోధ్య బాలరామచంద్ర ప్రతిష్ట తర్వాత రామాలయాల్లో సాయంత్రం వేళల్లో ఊరేగింపు, ప్రత్యేక పూజలు పెరిగాయి.



సన్నాపురం రామదేవ క్యాంపులో కోదండరామస్వామికి ప్రత్యేక పూజల దృశ్యం

బస్సులను అడ్డుకున్న విద్యార్థులు..!

రాయచూరు జనవరి 23: ప్రతిరోజు ఆలస్యంగా వస్తూ అసౌకర్యానికి గురి చేస్తున్న ఆర్టీసీ బస్సును విద్యార్థులు అడ్డుకుని ఆందోళన చేసిన సంఘటన మంగళవారం రాయచూరు జిల్లాలోని మస్కి తాలూకా బైలగుడ్డ వద్ద చోటు చేసుకుంది. తాలూకాలోని బైలగుడ్డ, తీర్థబాయి గ్రామాల నుంచి దాదాపు 60 మందికి పైగా విద్యార్థులు ప్రతిరోజు మస్కి పట్టణంలోని కళాశాలలు, పాఠశాలలకు వెళుతుండగా బస్సు ఆలస్యం కారణంగా ప్రిపరేషన్ పరీక్షలకు గైర్హాజరయ్యారు. దీంతో ఆగ్రహించిన విద్యార్థులు ఆర్టీసీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తు రోడ్డుపై ధర్నాకు దిగారు. వీరికి గ్రామస్థులు కూడా మద్దతు తెలిపి ఆర్టీసీ అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాఠశాలలు, కళాశాలల సమయానుకూలంగా బస్సులు నడపాలని తాము ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా ఆర్టీసీ అధికారుల నుంచి స్పందన లేకపోవడం బాధ్యతరాహిత్యమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు.

తగ్గుతున్న తుంగభద్ర నీటి ప్రవాహం

బళ్లారి సిటీ, జనవరి 23: బళ్లారి జిల్లా కంప్లి, కురుగోడు, సిరుగుప్ప ఎగువ భాగంలో తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం తక్కువుగా ఉండడంతో గ్రామం చుట్టుప్రక్కల ఉన్న పంపుసెట్లలో భూగర్భ జలాలు అడుగంటున్నాయి. దీంతో రైతులు నానా అవస్థ పడుతున్నారు. పశువులు తాగడానికి నీరులేక ఇబ్బంది పడుతున్నాయి. మరికొద్దిరోజుల తర్వాత కందకాలలో కూడా నీరు లభించడం ఈసారి కష్టమని గ్రామస్థులు చెబుతున్నారు.

మత్స్యకారులకు ఇబ్బంది

గ్రామంలోని ఎగువ భాగంలోని శంకరాచారి, దిగువ భాగంలోని మన్నూర్ క్యాంపు, సుగూరు చెక్‌డ్యాం సమీపంలోని కందకాలలో కొంతమేర నీరు నిల్వ ఉంది. గ్రామంలో సుమారు 30 మంది మత్స్యకారులు ఉండగా చేపలు పట్టడం వారి ప్రధాన వృత్తి. చెరువులోకి తెప్పల సహాయంతో వెళితే సరిపడా చేపలు దొరకడం లేదని గ్రామానికి చెందిన మత్స్యకారులు జంబునాథ్, వెంకటేశ్, ఉమాపతి, శరన్ వాపోతున్నారు. తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువుగా చేపలు పట్టి వారి జీవనం సాగించేవారు. ఈఏడాది సరిగా వర్షాలు లేక పోవడంతో నదిలో చేపలు లభించడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. కొద్దిరోజులకు పశువులకు తాగడానికి కూడా కష్టంగా మారవచ్చని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చుట్టుప్రక్కల ఉన్న మత్స్యకారులకు బ్రతుకు భారంగా మారింది.



తగ్గిన తుంగభద్ర నీటి ప్రవాహం



ఎండవేడిమికి తాళలేక కొద్దిపాటి నీటిలో పొర్లాడుతున్న గేదెలు

ట్రాక్టర్ డ్రైవర్ మృతి

గుత్తి, జనవరి 23: అనంతపురం జిల్లా గుత్తి ఆర్ఎస్‌లోని ఫంక్షన్ హాల్ సమీపంలో ప్రమాదవశాత్తు డీవైడర్‌ను ఢీకొని కర్ణాటకకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నాగేంద్ర(35) మృతి చెందాడు. కర్నాటక రాష్ట్రం బళ్లారి జిల్లాకు చెందిన చిలకూర్తి గ్రామానికి చెందిన నాగేంద్ర మండలంలోని బాచుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద వాటర్ ట్రాక్టర్ ట్యాంకర్ డ్రైవరగా పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం గుత్తి వైపు ట్యాంకర్‌తో వెళ్తుండగా ఆర్కే ఫంక్షన్ హాల్ వద్ద రాగానే డీవైడర్‌ను ఢీకొని కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఫిట్స్ రావడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన నాగేంద్ర

హొసూరు జోన్

ఆనేకల్‌లో పెరుగుతున్న చైన్‌స్నాచింగ్ కేసులు



మహిళ మెడలోని గొలుసు లాగుతున్న దుండగులు (సీసీ టీవీ పుటేజీ)

హొసూరు (మత్తిగిరి) జనవరి 23: కర్ణాటక ఆనేకల్ ప్రాంతంలో గతనెల రోజులుగా గొలుసు దొంగల సంచారం ఎక్కువైంది. ఈ గొలుసు దోపిడీకి పాల్పడుతున్న వారు రాణి గ్యాంగ్‌కు చెందినవారని తెలుస్తోంది. కర్ణాటకలోని ఆనేకల్‌లో గత నెలరోజులుగా దుండగులు జనసంచారంలేని చోట్లలో ఒంటరిగా నడిచి వెళ్లే మహిళలను వెంబడిస్తూ మెడలోని గొలుసును లాక్కొని పరారవుతున్నారు. దీంతో ఆ చుట్టు ప్రాంతాలలో మహిళలు భయాందోళనకు గురౌతున్నారు. దొంగలు ఎరుపు, నలుపు పల్సర్ బైక్‌ల్లో తిరుగుతున్నట్లు తెలిసింది. కొద్దిరోజుల క్రితం అత్తిపల్లి, సూర్యనగర్, జిగిని, ఆనేకల్‌ల్లో వరుసగా చోరీలు జరుగుతున్నట్లు, ద్విచక్రవాహనంపై గుర్తుపట్టని విధంగా ఇద్దరు హెల్మెట్లు పెట్టుకుని గొలుసు దోపిడీకి పాల్పడుతున్నట్లు తెలిసింది. మరో గ్యాంగు తమిళనాడు హొసూరులో కూడా ఇదే ప్రకారం పనిచేస్తోంది. ఈ మేరకు అత్తిపల్లి, సజ్జాపురం, ఆనేకల్ పోలీస్‌స్టేషనన్‌ల్లో కేసు నమోదైంది, ఒంటరి మహిళలు జాగ్రత్తగా ఉండాలని, దుర్ఘటన జరిగిన వెంటనే ఆయా పరిధిలోని స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలిపారు.

వైభవంగా హనుమంతరాయ కుంభాభిషేకం

హొసూరు జనవరి 23 : హొసూరు జూజూవాడి ప్రాంతంలో హనుమంతరాయ స్వామి దేవాలయం ఉంది. ఈ ఆలయం 12 సంవత్సరాల క్రితం నిర్మించబడింది. ఈ ఆలయ మంగళవారం మహా కుంభాభిషేకం జరిగింది. ఈ సందర్భంగా గత నెల 20వ తేది నుంచి ఆలయంలో వివిధ హోమాలు, పూజలు, పారాయణం, నిర్వహిస్తున్నారు, అనంతరం స్వామివారికి వివిధ రకాల పూజలు, హోమాలు నిర్వహించి గోపుర కుంభ కలశానికి పవిత్ర జలంతో మహా కుంభాభిషేకం నిర్వహించారు. దీనికి హొసూరు జూజూవాడి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వేలాది మంది పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులందరికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



జూజూవాడిలో కొలువుదీరిన హనుమంతరాయ స్వామి

వాహనదారులు వేగం తగ్గించాలి

హొసూరు జనవరి 23 :హొసూరు శానమావు అడవుల్లో 8 ఏనుగులు ఉన్నాయని, వాహనదారులు ఆ ప్రాంతంలో వెళ్లే సమయంలో వేగం తగ్గించాలని, అటవీశాఖ అధికారులు సూచించారు. ఈ ఏనుగులు తరచూ అటవీ ప్రాంతాల్లో ఉన్న రాష్ట్ర రహదారిని దాటుతున్నాయని, కావున వాహనాలు అధిక వేగంతో వెళ్లరాదని, నిదానంగా వెళ్లాలని, ఎక్కువ శబ్దం చేయవద్దని సూచించారు, మేకలను మేపడానికి లేదా, కట్టెలు సేకరించడానికి ప్రజలు ఎవ్వరు అటవీ ప్రాంతానికి వెళ్లవద్దని కూడా సూచించారు. రాత్రి వేళ్లలో కాపలా కోసం పొలాలకు వెళ్లవద్దని, ఇళ్లలో లైట్లు వేసివుంచాలని, రెండు రోజుల్లో 8 ఏనుగులను డెంకణీకోట అటవీ ప్రాంతానికి పంపుతామన్నారు.



శానమావు అడవుల్లో మకాంవేసిన ఏనుగులు

రాహుల్ న్యాయయాత్రను అడ్డుకోవడం దుర్మార్గం



అంబేడ్కర్ సర్కిల్ వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

● భగ్గుమన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ● అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన

రాయచూరు, జనవరి 23: భారత్ జోడో న్యాయ యాత్ర చేపట్టిన రాహుల్ గాంధిని ఆలయ ప్రవేశం చేయకుండా అడ్డుకుంటున్న బీజేపీ ప్రభుత్వం తీరు దుర్మార్గమని కాంగ్రెస్ నాయకులు పారస్‌మల్ సుఖాణి ఆరోపించారు. యాత్రను అడ్డుకోవడాన్ని నిరశిస్తు మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తు ప్రత్యేర్థులను రాజకీయంగా అణచివేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు రాజ్యాంగవిరుద్ధమని ఆరోపించారు. రాహుల్ గాంధి యాత్రతో బీజేపీ నాయకుల్లో ఆందోళన మొదలైందనేందుకు ఇలాంటి అడ్డగింతలే నిదర్శనమన్నారు. బీజేపీ తన నిరంకుశ ధోరణిని మార్చుకోకపోతే ప్రజల నుంచి ఛీత్కారం తప్పదని హెచ్చరించారు.

డిమాండ్ల సాధనకు నౌకర్ల ఆందోళన

రాయచూరు జనవరి 23: ఏళ్ల తరబడి సేవలందిస్తున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని మధ్యాహ్న భోజనం బిసిఊట నౌకర్లు మంగళవారం నగరంలో ఆందోళన నిర్వహించారు. స్థానిక పబ్లిక్ గార్డన్ నుంచి టిప్పు సుల్తాన్ గార్డన్ వరకు ర్యాలీ నిర్వహించిన వారు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ర్యాలీలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన కార్మికులు ఏళ్లతరబడి పని చేస్తున్న తమకు ఇప్పటివరకు కనీస వేతనాలు సహితం అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. దీంతో పాటు రిటైరయిన అంగన్‌వాడీలు, బిసిఊట నౌకర్లకు కనీసం నెలకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

హోమీ జహంగీర్ బాబా (వర్ధంతి)



భారత అణు కార్యక్రమానికి పితామహుడిగా పేరొందిన హోమీ జహంగీర్ బాబా 1909 అక్టోబరు 30న ముంబైలో జన్మించారు. న్యూక్లియర్ ఫిజిక్స్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టిఐఎఫ్ఆర్), అటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్ మెంట్ ట్రాంబే (ఏఈఈటీ) సంస్థలకు వ్యవస్థాపక డైరెక్టర్. ఆయన గౌరవార్థం సంస్థకు బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ అని పేరు పెట్టారు. భారత అణ్వాయుధాల అభివృద్ధికి ఈ రెండు సంస్థలు మూలస్తంభాలుగా నిలిచాయి. ఆడమ్స్ ప్రైజ్, పద్మ భూషణ్ పురస్కారం అందుకున్నారు. మూడు సార్లు భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతికి నామినేట్ అయ్యారు. 1966 జనవరి 24న కన్నుమూశారు.

సర్ విన్‌స్టన్ చర్చిల్ (వర్ధంతి)



సర్ విన్‌స్టన్ లియోనార్డ్ స్పెన్సర్ చర్చిల్ 1874 జనవరి 30న జన్మించారు. బ్రిటీష్ కింగ్‌డమ్‌కు రెండుసార్లు ప్రైమ్ మినిస్టర్‌గా వ్యవహరించిన ఆయన బ్రిటీష్ స్టేట్స్‌మన్, సోల్జర్, రైటర్‌గాను రాణించారు. సుదీర్ఘకాలం కన్సర్వేటివ్ పార్టీలో కొనసాగినా కొంతకాలం లిబరల్ పార్టీలోనూ సభ్యుడిగా ఉన్నారు. అలాగే బ్రిటీష్ ఆర్మీ, టెర్రిటోరియల్ ఆర్మీలోనూ పని చేశారు. రాజకీయాల్లోనూ ఎదిగి ఎంపీగా, ప్రధాన మంత్రి అయ్యారు. 1965 జనవరి 24న కన్ను మూశారు.

దక్షిణాది మార్కెట్‌లోకి సెంట్రిసిటి



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ప్రముఖులు

బెంగళూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గురుగ్రామ్ ప్రధాన కేంద్రంగా సేవలందిస్తున్న వెల్టెక్ స్టార్టప్ సెంట్రిసిటీ బెంగళూరులోని చర్చ్‌స్ట్రీట్‌లో తన నూతన కార్యాలయాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా సెంట్రిసిటి సంస్థాపక టీమ్ సభ్యు డు దక్షిణ విభాగాన్ని పర్యవేక్షిస్తున్న అనిరుద్ధ్ మహనోత్ , సిఇఓ మను అవస్తి నగరంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బెంగళూరు తమకు ప్రముఖ మార్కెట్‌గా ఉందని ఐఐటి మద్రాస్ పరిశోధనా విభాగంతో ఒప్పందం కుదుర్చుకున్నామని ఆస్తుల నిర్వహణ, ఆర్థిక ఉత్పత్తుల పంపిణీలో వినూత్న విధానాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. తమ సంస్థకు దేశంలోని 12 రాష్ట్రాలలో 1600 మందికి పైగా ఆర్థిక వ్యవహారాల నిపుణుల నెట్‌వర్క్ ఉందన్నారు. రానున్న రోజుల్లో దేశంలో తమ కార్యకలాపాలనుమరింతగా విస్తరించుకునే ఆలోచన ఉందని ప్రకటనలో తెలిపారు.

జనన ఆరోగ్య సమస్యలపై అవగాహన

బెంగళూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలంతోపాటు పలువురు చిన్నారులు పుట్టుకతోనే పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని వీటి నివారణకు, చికిత్సకు ఖచ్చితమైన ఔషధాలు సిఫారసు చేయడం ఒక సవాల్‌గా ఉన్నాయని రాజాజీనగర్ అపోలో క్రేడల్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ నిరంజన్ హెచ్ఎస్ అభిప్రాయపడ్డారు. ప్రత్యేకంగా ఏర్పాటైన చర్చాగోష్టిలో డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి, పర్యావరణం, ఇతరత్రా అంశాలు, వంశ పారంపర్య తదితర అంశాలు చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయన్నారు. సంపూర్ణ జీనోమ్ అనుక్రమ, జెనెటిక్ టెక్నాలజీ ఉపయోగించి ఖచ్చితమైన ఔషధాల తయారీకి సిద్ధమవుతున్నట్టు తెలిపారు. రోగ నిర్ధారణ తర్వాతే సరైన ఔషధం వాడకానికి సిఫారసు చేసే అవకాశం ఉందన్నారు. ఈ దిశగా మరిన్ని పరిశోధనలు సాగుతున్నాయన్నారు.

టోకెన్ టికెట్ల వైపే మెట్రో ప్రయాణికుల మొగ్గు

బెంగళూరు మెట్రో, జనవరి 23: నగరంలో నమ్మ మెట్రో మార్గాలు విస్తరించిన కొద్దీ ప్రయాణీకుల సంఖ్య పెరుగుతోంది. ఈ సందర్భంగా ప్రయాణానికి క్యూఆర్ కోడ్, స్మార్ట్‌కార్డ్ వ్యవస్థ ఉన్నప్పటికీ అత్యధిక ప్రయాణీకులు మాత్రం టోకెన్ టికెట్లవైపే మొగ్గు చూపుతుండడం గమనార్హం. క్యూఆర్ కోడ్, స్మార్ట్‌కార్డులకు చార్జీలో 5శాతం రాయితీని బీఎంఆర్‌సీఎల్ ఇస్తోంది. అయినా పట్టించుకోకుండా సాధారణ టోకెన్ టికెట్ల కొనుగోలుపై దృష్టి సారిస్తున్నారని బీఎంఆర్‌సీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏఎస్ శంకర్ వెల్లడించారు. మెట్రో రైళ్లలో ప్రతిరోజూ సగటున 6 లక్షలమంది దాకా ప్రయాణిస్తుండగా వారిలో 80శాతం మంది టోకెన్ టికెట్లతోనూ ప్రయాణిస్తున్నారన్నారు. 15శాతంమంది స్మార్ట్‌కార్డులు, 5శాతం మంది క్యూఆర్ కోడ్ ఉపయోగిస్తున్నారన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి

▸▸ కర్ణాటక తెలుగు ప్రజా సమితి డిమాండ్

బెంగళూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించిన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని కర్ణాటక తెలుగు ప్రజా సమితి కోరింది. సమితి అధ్యక్షుడు డాక్టర్ బొందు రామస్వామి నగరంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించి చేతులు దులుపుకున్నారని కేంద్రం తీరుపై ఆయన ఒకింత అసహనం వ్యక్తం చేశారు. విభజన హామీలు అమలయ్యేలా కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత బీజేపీతోపాటు అన్ని రాజకీయ పార్టీలపై ఉందన్నారు. విభజన హామీల అమలుకోసం ఆంధ్ర మేధావుల ఫోరం తదితర సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాలకు సంఘీభావంగా ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నల్లబ్యాడ్జీలు ధరించాలని సమితి నిర్ణయించిందన్నారు. కేంద్రప్రభుత్వానికి కూడా ప్రత్యేక వినతిపత్రాన్ని పంపుతామన్నారు.

నాగనాథేశ్వర ఆలయాన్ని పరిశీలించిన అధికారులు



సమస్యలు ఆలకిస్తున్న దేవదాయశాఖ ఉన్నతాధికారి మీరా

చింతామణి, జనవరి 23: పట్టణంలోని ఎన్ఎన్‌టీ లే అవుట్‌లోగల పురాతన నాగనాథేశ్వర ఆలయ జీర్ణోద్ధరణ, మూల విరాట్టు తరలింపు అంశంపై తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు రాష్ట్ర దేవదాయ శాఖ ఉన్నతాధికారి మీరా నేతృత్వంలో సాంకేతిక సిబ్బంది, ఆగమ వాస్తుశాస్త్ర పండితులు మంగళవారం పరిశీలించారు. రెండోసారి పరిశీలనలో స్థానిక రెవెన్యూ అధికారులు కూడా పాల్గొన్నారు. ఆలయ నిర్మూలనా సమితికి చెందిన నగరసభ సభ్యుడు దేవళం శంకర్, రామకృష్ణప్పలు మూలవిరాట్టును తొలగించడాన్ని సమర్థించుకున్నారు. భక్తమండలి తరపున హాజరైన నగరసభ మాజీ సభ్యుడు ఎస్ సుబ్రమణ్య, టీ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ నిర్మూలనా సమితి సభ్యులు నిబంధనలు ఉల్లంఘించడాన్ని విచారణ సమితి ముందు ప్రస్తావించారు. ఇలా రెండు వర్గాల మధ్య వాగ్వాదం తీవ్రం కాగా పట్టణ ఇన్‌స్పెక్టర్ రంగస్వామయ్య జోక్యం చేసుకుని ప్రభుత్వం విధించిన షరతులను తప్పనిసరిగా అమలు చేయాలని లేని పక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా భక్తుల తరపున నగరసభ మాజీ సభ్యుడు సత్యనారాయణ, ఉమేశ్, కుంటిగడ్డ లక్ష్మణ, కేపీసీసీ కార్యదర్శి కోనప్పల్లి కోదండ, ఆలయ అర్చకులు నాగేంద్ర దీక్షిత్, కమలేశ్ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు లేఖనా సామగ్రి పంపిణీ

శిడ్లఘట్ట, జనవరి 23: అయోధ్య శ్రీరామమందిరంలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో తాలూకా వ్యాప్తంగా పలు ఆలయాలలో విశేషపూజలు కొనసాగాయి. ఇందులో భాగంగా కొత్తనూరు పంచాయతీలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో అభిషేకం, రామతారక హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రామాయణంపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు లేఖనా సామగ్రి పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన యువ ప్రముఖుడు రవికుమార్ మాట్లాడుతూ సుమారు 500 సంవత్సరాల తర్వాత రాముడు మళ్ళీ అయోధ్యకు వచ్చాడన్నారు. ఇందుకు ఎంతో మంది కరసేవకులు, రామభక్తుల శ్రమ, త్యాగం ఉందన్నారు. ప్రతి గ్రామంలోనూ రాముడికి పూజలు చేశారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వందలాది మంది భక్తులకు లడ్డూలను పంపిణీ చేసి అన్నదాసోహం నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మీపతి, నవీన్, శంకర్, మనోజ్, సుమంత్, వినోద్, సుమన్, గౌరిశంకర్, శశికుమార్, శ్రీనివాస్ శాస్త్రి, భజనామండలి ముఖ్యులు చీమనహళ్ళి మునిశామప్ప తదితరులు పాల్గొన్నారు.

రామాయణ పాత్ర పోటీలు

శ్రీరాముడి ఆదర్శాలపై నేటి యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సమాజసేవకుడు సీకల్ రామచంద్రగౌడ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని వాసవి విద్యాసంస్థ ఆవరణలో విద్యార్థులకు రామాయణ ఇతిహాసంలోని వేషధారణ పోటీలు నిర్వహించారు. కాగా ఐదు శతాబ్దాల తర్వాత కృషికి ఫలితం దక్కిందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా మన సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే సందర్భంగా అయోధ్య కరసేవలో పాల్గొన్నవారిని ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ, ఆర్యవైశ్యమండలి అధ్యక్షుడు కృష్ణయ్యశెట్టి, వాసవి విద్యాసంస్థ పాలనాధికారి రూపసి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులతో విద్యార్థులు, నిర్వాహకులు



వివిధ వేషధారణ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నిధుల దుర్వినియోగం ఆరోపణలు నిరాధారం



మీడియా సమావేశంలో సంఘం కార్యదర్శి ఆంజనేయరెడ్డి తదితరులు

బాగేపల్లి, జనవరి 23: తాలూకాలోని చిత్రావతి టెంపో యజమానులు, డ్రైవర్ల క్షేమాభివృద్ధి సంఘంలో రూ.1.30 కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయన్న ఆరోపణలు నిరాధారమని సంఘం కార్యదర్శి ఆంజనేయరెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సంఘం పదాధికారులతో కలసి మీడియాతో మాట్లాడుతూ ఈనెల 19న సంఘం మాజీ అధ్యక్షుడు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కేవలం వ్యక్తిగత ద్వేషంతోనే ఆరోపణలు చేశారన్నారు. నిధులు దుర్వినియోగం చేసి ఉంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కోర్టులో రుజువు చేయాలన్నారు. అయితే ఇలా ఇష్టం వచ్చినట్టు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఆరోపణలతో తన గౌరవానికి భంగం కలిగిందని ఇందుకు చట్టరీత్యా చర్యలకు కోర్టును ఆశ్రయిస్తానన్నారు. మీడియా సమావేశంలో ఎస్ఎం కృష్ణప్ప, పీఎస్ ఆనంద్, రవికుమార్, ఆనంద్, లోకేశ్, సత్యనారాయణ రెడ్డి, శ్రీనాథ్, గణేశ, ఎంఎస్ శివ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యలబుర్గిలో శ్రీరాముడికి విశేష పూజలు



ప్రత్యేక పూజల్లో గ్రామస్థులు

బంగారపేట, జనవరి 23: తాలూకాలోని యలబుర్గి గ్రామంలో శ్రీరాముడికి విశేష పూజలు, రామకోటి, భజనల అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు, సభ్యుడు లక్ష్మణ్ మాట్లాడుతూ రామజన్మభూమి అయోధ్యలో రామలల్లా ప్రతిష్ఠాపనతో ఐదు శతాబ్దాల కల సాకారమైందన్నారు. సోమవారం రాత్రి వరకు పలు కార్యక్రమాలు సాగాయి. గ్రామపెద్ద అంజనప్ప మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఎస్ అరుణ్, మేస్త్రి అశోక్, వెంకటేశప్ప, ఆంజప్ప, రవికుమార్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని శ్యామ్ ఆసుపత్రి వద్ద స్థానికులు శ్రీరాముడికి విశేషపూజలు దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. న్యాయాధికారి కేశవమూర్తి మాట్లాడుతూ దేశప్రజలంతా ఎదురుచూస్తున్న అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపన జరిగిందని వీక్షించే అవకాశం లభించడం మన అదృష్టమన్నారు. ఉపాధ్యాయుడు ఎం నారాయణస్వామి మాట్లాడుతూ ఇది పండుగ లాంటిదని, ప్రజలందరిపై శ్రీరాముడి కృపా కటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామ చంద్రప్ప, గ్రామపంచాయతీ సభ్యుడు గోపాల్, ఉపాధ్యాయులు నాగరాజ్, సుధాకర్, మంజునాథ్, శ్రీనివాస్ బాలాజి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులు స్వాభిమానంతో జీవించేందుకు సహకరించాలి



సంక్రాంతి ఉత్సవంలో ఎమ్మెల్యే దంపతులు

మహదేవపుర, జనవరి 23: ప్రకృతి వైపరీత్యాలు, అప్పుల ఊబిలోకి రైతులు చిక్కుకుంటున్నారని అలా కాకుండా దేశానికి అన్నం అందించే రైతులు స్వాభిమానంతో జీవించే వాతావరణం నెలకొనేలా అందరూ సహకరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే మంజులా అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పీయూ కళాశాల మైదానంలో వర్తూరు క్రీడా, సాంస్కృతిక సంఘం ఏర్పాటు చేసిన సంక్రాంతి ఉత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశానికి వెన్నెముక రైతులని అతివృష్టి, అనావృష్టి సమస్యలతే కాకుండా అప్పుల బాధతో పలువురు రైతులు ఆత్మహత్యకు శరణ్యమవు తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితికి గురికాకుండా అన్నదాతలను ఆదుకునేలా ప్రభుత్వాలు తగిన చొరవ చూపాలన్నారు. సంక్రాంతి పండుగ మన సంస్కృతికి ప్రతీకగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఐటీబీ కంపెనీలు ఉన్నా పండుగలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. మజాభారత బృందంచే హాస్యమయ కార్యక్రమం, సంగీత సాయంత్రం ఇతర కార్యక్రమాలు రంజింపచేశాయి. నటుడు ప్రేమ్, కాంతార ఫేం సప్తమిగౌడ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అరవింద లింబావళి, మహేంద్రమోది, బీజేపీ హోబళి అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, చన్నసంద్ర చంద్రశేఖర్, ఎల్ రాజేశ్, బీఎస్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు ఉత్తర జిల్లా

బీజేపీ అధ్యక్షుడికి సన్మానం



హరీశ్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

బెంగళూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఉత్తర జిల్లా బీజేపీ అధ్యక్షునిగా నియమితులైన బీబీఎంపీ మాజీ ఉప మేయర్ ఎస్ హరీష్‌ను మహాలక్ష్మి లేఅవుట్ బీజేపీ నేతలు సోమవారం ఘనంగా సన్మానించారు. హోబళి అధ్యక్షుడు రాఘవేంద్ర శెట్టి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తర జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ఎన్ జయరామణ్ణ, బీబీఎంపీ మాజీ సభ్యులు కేవీ రాజేంద్రకుమార్, లోకేష్, జయసింహ, రఘునాగరాజ్, సురభి, నాగరాజ్, ప్రసన్న, హనుమంతు, సంపత్, భాస్కర్, అవిన్ ఆరాధ్య, తదితరులు పాల్గొన్నారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను విజయవంతంగా నిర్వహించే దిశలో పార్టీ శ్రేణులు తనకు పూర్తిగా సహకరించాలని అందరిని విశ్వాసంలోనికి తీసుకుంటూ ముందుకు సాగుతానని ఈ సందర్భంగా హరీష్ పేర్కొన్నారు.

పురవీధులలో శ్రీరాముడి ఊరేగింపు



బొమ్మనహళ్ళి, జనవరి 23: అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని బేగూరు రోడ్డులోని వినాయకస్వామి దేవస్థానంలో సోమ, మంగళవారాలలో విశేషపూజలు నిర్వహించారు. మారుతి యువజనసంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రసాద వినియోగం సాగాయి. సాయంత్రం సంగీత కార్యక్రమాలు కొనసాగాయి. మంగళవారం సాయంత్రం పురవీధులలో స్వామివార్ల ఊరేగింపు బొమ్మనహళ్ళి, విరాట్ నగర్‌ల మీదుగా బేగూరు రోడ్డుకు చేరుకుంది. మాజీ కార్పొరేటర్ మంజు నాథ రెడ్డి మాట్లాడుతూ 500 సంవత్సరాల తర్వాత యథాస్థితికి రాముడు వచ్చాడని దీంతో ప్రజల కల నెరవేరిందన్నారు. దేశ మంతటా రామరాజ్యం సాకారం కానుం దన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సంపత్, తదితరులు పాల్గొన్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరిం చారు.

నేడు నగరంలో శివబాలయోగి జయంతి

బెంగళూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): శివబాలయోగి మహరాజ్ 89వ జయంతి వేడుకలు నగరంలోని జేపీ నగర్ ఆశ్రమంలో బుధవారం జరుగనున్నాయి. ఆశ్రమం వర్కింగ్ చైర్మన్ డీ రాంబాబు ఈ మేరకు నగరంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు పూజలతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. అనంతరం పలు హోమాలను నిర్వహిస్తారు. మధ్యాహ్నం పూర్ణాహుతి, కుంభాభిషేకం జరుగుతాయి. సాయంత్రం 5 గంటల నుంచి ధ్యానం, అనంతరం సాయంత్రం 6-30 నుంచి భజనలు ఉంటాయి. రాత్రి 7 గంటలకు గిరిజా కల్యాణోత్సవం జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

రక్తదానంపై మరింత జాగృతి అవసరం



రక్తదాన శిబిరంలో దాతలతో నిర్వాహకులు

దొమ్మసంద్ర, జనవరి 23: రక్తదానం చేయడం ద్వారా ఎటువంటి దుష్పరిణామాలు ఉండవని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని, రక్తదానంపై మరింత జాగృతి అవసరమని బీజేపీ సీనియర్ నాయకుడు టీవీ బాబు అభిప్రాయపడ్డారు. ఆనేకల్ తాలూకా వీ కల్లహళ్ళి గ్రామంలో హలో కిడ్స్ కైజాన్ ప్రీస్కూల్ ఆవరణలో లయన్స్‌క్లబ్ సర్జాపుర, సక్ర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉచిత ఆరోగ్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యవంతమైన వ్యక్తి రక్తదానం చేయడం ద్వారా శరీరంలో కొత్త రక్తకణాలు ఉత్పత్తి అవుతాయని నిపుణులు వెల్లడించారని అయినా కూడా ప్రజల్లో ఇంకా కొన్ని అపోహలు ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. రక్తదానం శ్రేష్ఠదానమన్నారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ పూజాచంద్ర మాట్లాడుతూ సర్జాపుర ప్రాంతంలో లయన్స్‌క్లబ్ ఏర్పాటయ్యాక ఏడాది పొడవునా ఏదో ఒక సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరాలు, రక్తదాన శిబిరం, ప్రతి నెలా 15న సర్జాపురలో మధుమేహ పరీక్షా శిబిరం కొనసాగిస్తున్నట్టు తెలిపారు. శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 78మంది రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. శిబిరంలో డాక్టర్ పరమేశ్, బీజేపీ బెంగళూరు దక్షిణ జిల్లా కార్యదర్శి సవితా శివానంద, సక్ర ఆసుపత్రికి చెందిన గౌతమ్‌సింగ్, సర్జాపుర లయన్స్‌క్లబ్ అధ్యక్షులు రూపేశ్‌చంద్ర, దీప జెక్యూట్, ప్రదీప్, పదాధికారులు బిజోర్, ఆనిష్ పతిమా, అనుషా, లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహాల ఆధునికీకరణపై పెరుగుతున్న ఆసక్తి



ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సీకే రామమూర్తి తదితరులు

బెంగళూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గృహాలను అత్యాధునిక సదు పాయాలతో సింగారించు కుంటున్నారని నేడు ఇది ఫ్యాషన్‌గా మారిందని జయ నగర ఎమ్మెల్యే సీకే రామమూర్తి పేర్కొన్నారు. బెంగళూరు జేపీ నగర్‌లోని లెక్కో కుచినా ఏర్పాటు చేసిన మాడ్యులర్ విన్యాసాల శైలి ఫర్నిచర్ స్టోర్ ప్రత్యేక విభాగాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ ఇటాలియన్ సాంకేతికతో కూడిన వీటి విన్యాసాలకు తాను కూడా ఎంతో ఆకర్షితుడినయ్యానన్నారు. జేపీ నగర్‌లోని ఈ ఎక్స్‌పీరియన్స్ కేంద్రం బెంగళూరు దక్షిణ ప్రాంతంలో వినియోగాదారులకు ప్రధాన ఆకర్షణా కేంద్రం కానుందన్నారు. భారతజట్టు మాజీ క్రికెటర్ జావగళ్ శ్రీనాథ్ కూడా ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ కేంద్రంలో ఇటాలియన్ విన్యాసాల మాడ్యులర్ కిచెన్లు, అత్యాధునిక సాంకేతితతో కూడిన వార్డ్‌రూప్‌లను ఒకే చోట ప్రదర్శనలో ఉంచామని లెక్కో కుచినా భాగస్వామి బిఎన్. మానస్ వెల్లడించారు. ఏపీ, తెలంగాణలతో సహా తమకు దక్షిణాదిన మొత్తం 7 ఎక్స్‌పీరియన్స్ కేంద్రాలున్నాయన్నారు.

నగరంలో 711 డ్రైవింగ్ లైసెన్సుల రద్దు

బెంగళూరు మెట్రో, జనవరి 23: ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించారన్న ఆరోపణపై 2023లో 2974 వాహన యజమానుల డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేయాలంటూ ఆర్టీఓ కార్యాలయానికి పంపగా అందులో 711 రద్దు అయ్యాయని జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) అనుచేత్ వెల్లడించారు. మిగిలిన లైసెన్సుల రద్దు ప్రక్రియ జరుగుతోందన్నారు. కొన్ని వాహనాలు ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌లు కలిగి ఉండడంతో ఆమేరకు ఆయా ఆర్టీఓ అధికారులకు తెలిపామన్నారు. మంగళవారం ఉదయం 7 నుంచి 9.30 గంటల మధ్య నగరవ్యాప్తంగా 3414 స్కూల్ వాహనాల డ్రైవర్‌లను డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేయగా 16మందిపై కేసులు నమోదైనట్టు తెలిపారు. వీరి లైసెన్సులను సస్పెండ్ చేయాల్సిందిగా సిఫారసు చేస్తున్నట్టు తెలిపారు. కాగా ఇటీవల నగరంలో వీలింగ్‌కు పాల్పడేవారి సంఖ్య అధికమైందని అటువంటి వాహనాల ఆర్‌సీ కూడా రద్దు చేయనున్నట్టు తెలిపారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనల నియంత్రణకు సంబంధించి కామాక్షిపాళ్య ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పేపర్ డిస్ట్రిబ్యూటర్ల సంఘం ఆధ్వర్యంలో రాముడికి పూజలు



డైలీపేపర్ డిస్ట్రిబ్యూటర్‌ల సంఘం సభ్యులు

బెంగళూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన నేపథ్యంలో నగరంలోని గాంధీ నగర్‌కు చెందిన దినపత్రికల డిస్ట్రిబ్యూటర్‌ల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్య క్రమం నిర్వహించారు. స్థానిక గణేశ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీరాముడి చిత్రపటానికి పూజలు చేశారు. తదు పరి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సంగమ్ సురేశ్, ప్రధాన కార్యదర్శి దేవరాజ్, మెజస్టిక్ కే రమేశ్, నాగరాజ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు



పాల్గొన్న టీడీపీ అభిమానులు తదితరులు

బొమ్మనహళ్ళి, జనవరి 23: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు స్థానిక మడివాళ సహా తదితర ప్రాంతాలలో టీడీపీ అభిమానుల ఆధ్వర్యంలో జరిగాయి. అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభిమానులు అయ్యన్నగారి మధు, నవీన్, బాలాజి, రాజ శేఖర్, నీరజాక్షి నాయుడు, కిశోర్ నాయుడు, జీవీఎస్ రాజు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయాన్ని సందర్శించిన గోవిందానంద సరస్వతి స్వామిజీ



స్వామిజీకి స్వాగతం పలుకుతున్న అర్చకులు

అనంతపురం కల్చరల్, జనవరి 23: స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయాన్ని కర్ణాటక రాష్ట్రం తలకాడులోని బాలకృష్ణానంద మహాసంస్థానాధిపతి గోవిందానంద సరస్వతి స్వామిజీ మంగళవారం సందర్శించారు. తలకాడు నుంచి హైదరాబాద్ వెళ్తున్న స్వామి మార్గ మధ్యలో ఈ ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు స్వామికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు వెంకటస్వామి, సురేష్‌బాబు పాల్గొన్నారు.